సాక్షి నిర్మల్

శుక్రవారం । 20 । అక్టోబర్ । 2023

I



డిపాజిట్ గల్లంతు..!

పోలైన ఓట్లలో 1/6శాతం ఓట్లు వస్తేనే డిపాజిట్ దక్కుతుంది. 2018లో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఎమ్మెల్యేగా పోటీ చేసిన 123 మందిలో 100 మంది డిపాజిట్ కోల్పోయారు. IIలో▸



పల్సి మండలం కావాలని..

కుభీర్: మాలేగాం వద్దని, పల్సి కేంద్రంగా మండలం ప్రకటించాలని చేపట్టిన రిలే నిరాహార దీక్ష ఎనిమిదో రోజుకు చేరింది. గురువారం భవానీ దీక్షాపరులు, గ్రామస్తులు దీక్ష శిబిరంలో కూర్చున్నారు.

గరిష్ఠం/కనిష్ఠం
33.0 /22.0

వాతావరణం

సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. రాత్రివేళ మంచు కురుస్తుంది.

న్యూస్‌రీల్

పోలింగ్‌శాతం పెంపునకు కృషి చేయాలి



మహిళలతో కలిసి బతుకమ్మ ఆడుతున్న కలెక్టర్, ఏఎస్పీ, అధికారులు

భైంసాటౌన్/భైంసారూరల్: అసెంబ్లీ ఎన్నికల్లో మెరుగైన పోలింగ్ శాతమే లక్ష్యంగా పని చేయాలని కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ సూచించారు. గురువారం భైంసాలోని ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో నిర్వహించిన బతుకమ్మ వేడుకలు, స్వీప్ (సిస్టమేటిక్ వోటర్స్ ఎడ్యుకేషన్ ఎలక్టోరల్ పార్టిసిపేషన్) కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ఎన్నికల విధులు నిర్వహించే బీఎల్వోలు, పోలింగ్ అధికారులు సీ–విజిల్ యాప్, ఈవీఎంలపై ఓటర్లకు అవగాహన పెంచే కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. మాడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ నియమావళి తప్పనిసరిగా పాటించేలా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం డీఆర్డీవో విజయలక్ష్మి, ఏఎస్పీ కాంతిలాల్‌పాటిల్‌తో కలిసి బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్నారు. అక్కడి నుంచి బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలలోని పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించారు. ఆర్డీవో సీహెచ్ కోమల్‌రెడ్డి, తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్ తదితరులున్నారు.

న్యూబొప్పారం వాసికి చరిత్ర విభాగంలో డాక్టరేట్



పీజీరెడ్డిని సన్మానిస్తున్న యువకులు

సోన్: డిగ్రీ కళాశాలలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వహిస్తున్న మండలంలోని న్యూబొప్పారం గ్రామానికి చెందిన పీజీరెడ్డి చరిత్ర విభాగంలో డాక్టరేట్ పొందారు. ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్ జీ అంజయ్య పర్యవేక్షణలో 'మధ్యయుగ ఆంధ్రదేశ్‌లోని (1000–1687 సీఈ) సాంఘిక, సాంస్కృతిక మరియు ఆర్థిక పరిస్థితులు' అనే అంశంపై సుమారు 700 ఏళ్ల పరిస్థితుల గురించి విస్తృత స్థాయిలో పరిశోధన చేసి తన సిద్ధాంత గ్రంథాన్ని అందించారు. దీంతో అతడికి ఓయూ డీన్ అర్జున్‌రావు చేతులమీదుగా చరిత్ర విభాగంలో డాక్టరేట్ పట్టా పొందారు. ఈ సందర్భంగా జీపీ రెడ్డిని పలువురు గ్రామస్తులు అభినందించారు.

'రైతులతో దురుసుగా ప్రవర్తిస్తే లైసెన్స్ రద్దు'

భైంసాటౌన్: వ్యవసాయ మార్కెట్ యార్డులో పంట ఉత్పత్తుల విక్రయానికి వచ్చే రైతులతో దడ్వాయిలు, హమాలీలు, కమీషన్ ఏజెంట్లు దురుసుగా ప్రవర్తిస్తే వారి లైసెన్స్ రద్దు చేస్తామని భైంసా ఏఎంసీ చైర్మన్ రాజేశ్‌బాబు హెచ్చరించారు. లోకేశ్వరం మండలానికి చెందిన రైతుపై దాడిచేసిన హమాలీ షేక్ సలీంపై చర్యలు తీసుకోవాలని కురుమ సంఘం నాయకులు, రైతు సంఘాల ప్రతినిధులు గురువారం ఏఎంసీ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా చైర్మన్ వారితో మాట్లాడుతూ.. సదరు హమాలీ లైసెన్స్ ఎందుకు రద్దు చేయకూడదో మూడురోజుల్లో వివరణ కోరుతూ నోటీసు జారీ చేసినట్లు చెప్పారు. సరైన సమాధానం రాని పక్షంలో అతడి లైసెన్స్ రద్దు చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఏఎంసీ వైస్ చైర్మన్ జేకే పటేల్, ఉన్నత శ్రేణి కార్యదర్శి అడెల్లు, కురుమ సంఘ నాయకులు రాజారాం, సాయిరాం తదితరులున్నారు.

వైఎస్సార్‌టీపీ టికెట్ కోసం దరఖాస్తు



దరఖాస్తు అందజేస్తున్న సిద్ధార్థ్‌నాయక్

ఖానాపూర్: నియోజకవర్గ వైఎస్సార్‌టీపీ టికెట్ కోసం కడెం మండలం కొత్తమద్దిపడగ గ్రామానికి చెందిన భానావత్ సిద్ధార్థ్‌నాయక్ గురువారం హైదరాబాద్‌లోని లోటస్‌పాండ్ లోగల పార్టీ కార్యాలయంలో దరఖాస్తు చేసుకున్నారు. పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి పిట్ట రాంరెడ్డికి దరఖాస్తు అందించారు. ఆయన వెంట పార్టీ ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షురాలు గంగ్రోత్ నాగమణి, పార్టీ వ్యవహారాల కమిటీ అధ్యక్షుడు ముస్తఫా తదితరులున్నారు.

చేపపిల్లల పంపిణీ

లోకేశ్వరం: మన్మద్, సాథ్‌గాం, హవర్గ, నగర్, మొహాళ, హథ్‌గాం గ్రామాల్లోని మత్స్యకారులకు గురువారం నిర్మల్ మత్స్యశాఖ ఫీల్డ్ అధికారి ఎండీ గయాజొద్దీన్ తొమ్మిది లక్షల చేపపిల్లలు పంపిణీ చేశారు. అనంతరం చెరువుల్లో వదిలారు. గయాజొద్దీన్ మాట్లాడుతూ.. మత్స్యకారులు సంఘాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. సిబ్బంది రంజిత్ ఉన్నారు.

కారు.. ప్రచారజోరు

- స్పీడ్ పెంచిన బీఆర్‌ఎస్
- సెంటిమెంట్ పాటిస్తున్న 'అల్లోల'
- గ్రామాలను చుట్టేస్తున్న విఠల్‌రెడ్డి
- జనాల్లోనే ఉంటున్న జాన్సన్‌నాయక్
- ప్రణాళికాబద్ధంగా 'గులాబీ' ప్రచారం



వాస్తాపూర్‌లో ఎన్నికల ప్రచారంలో భాగంగా యువకులతో కలిసి నృత్యం చేస్తున్న మంత్రి ఐకేరెడ్డి

జంగ్ తెలంగాణ

నిర్మల్: అన్ని పార్టీలకంటే ముందే అభ్యర్థులను ప్రకటించిన బీఆర్‌ఎస్ 'బీ' ఫాంలు కూడా అందజేసింది. ఇప్పుడు ప్రచారంలోనూ అదే స్పీడ్‌తో దూసుకుపోతోంది. ప్రత్యర్థి పార్టీలతో పోలిస్తే సరిపడా సమయం ఉండటంతో బీఆర్‌ఎస్ పక్కా ప్రణాళికతో ప్రచారపర్వం చేపడుతోంది. అభ్యర్థులు ప్రచారంతోపాటు ప్రధాన నాయకులు, కులసంఘాల్లో ప్రాముఖ్యత ఉన్న నేతలు, సోషల్ మీడియా బృందాలను సమన్వయం చేసుకుంటున్నారు. తమ పేరును వీలైనంత ఎక్కువగా జనాల్లోకి తీసుకెళ్లే ప్రయత్నం చేస్తున్నారు. ఇక అభ్యర్థులు ప్రచారంలో ఉంటే వారి కుటుంబసభ్యులు, ముఖ్య అనుచరులు ఏర్పాట్లు చూసుకుంటున్నారు.

'అల్లోల' అదే సెంటిమెంట్..

నిర్మల్ నియోజకవర్గంలో దేవాదాయశాఖ మంత్రిగా రెండోసారి గెలిచి మళ్లీ సెంటిమెంట్‌ను తిరగరాయాలన్న లక్ష్యంతో మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. ఇందుకోసం తన సెంటిమెంట్లనూ ఫాలో అవుతున్నారు. చాలా ఎన్నికల్లో 'అల్లోల' తన ప్రచారాన్ని మామడ మండలం వాస్తాపూర్ నుంచి ప్రారంభించడం ఆనవాయితీగా కొనసాగుతోంది. ఇదే క్రమంలో బుధవారం తన స్వగ్రామం నిర్మల్‌రూరల్ మండలం ఎల్లపెల్లిలో పెద్దలు, గ్రామస్తుల ఆశీర్వాదం తీసుకున్నారు. గురువారం ఎప్పటిలాగే ఊరు దాటి తొలి ప్రచారాన్ని వాస్తాపూర్ నుంచే ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రికి ఆ గ్రామంలో నివసించే ఆదివాసీలు తమ ఆచారం ప్రకారం ఘనస్వాగతం పలికారు. ఇక ఎన్నికల వరకూ ఇదే స్పీడ్‌లో ప్రచారాన్ని కొనసాగించేందుకు షెడ్యూల్ సిద్ధం చేసుకున్నారు. 'అల్లోల' ప్రచారం, పార్టీ కార్యక్రమాల్లో ఆయన తనయుడు గౌతమ్‌రెడ్డి అన్నీతానై వ్యవహరిస్తున్నారు. యువత, ప్రజల్లోకి కొత్తగా పార్టీని తీసుకెళ్లేందుకు 'సెల్ఫీ విత్ కార్' పెట్టారు. గులాబీరంగులో మిరమిట్లుగొలిపే విద్యుత్‌కాంతులతో తమ పార్టీ గుర్తయిన అంబాసిడర్ కారును తయారు చేయించారు. ప్రస్తుతం ఈ కారు నియోజకవర్గంలో ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది.



ముధోల్ మండలంలో ప్రచారం చేస్తున్న విఠల్‌రెడ్డి



దస్తురాబాద్‌లో పార్టీ ఆఫీస్ ప్రారంభిస్తున్న జాన్సన్

ఊళ్లను చుట్టేస్తున్న విఠల్‌రెడ్డి

నామినేషన్‌కు ముందే అనుకున్న ఊళ్లన్నింటినీ ముధోల్ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి చుట్టేస్తున్నారు. ఎక్కడెక్కడికి వెళ్లాలో ముందే నిర్ణయించుకుని, ఏ ఊరు, ఏ వీధి వదలకుండా తిరుగుతున్నారు. అక్కడ ప్రతిఒక్కరినీ పలకరిస్తూ మరోసారి గెలిపించాలని కోరుతున్నారు. ఎక్కడా లేనివిధంగా ముధోల్ నియోజకవర్గంలో యువతకంటే పెద్దమనుషులదే రాజకీయం నడుస్తోంది. ఈక్రమంలో ఊళ్లల్లోని పెద్దమనుషులను కలుస్తూ వారిని వెంట పెట్టుకుని ముందుకు సాగుతున్నారు. సరిహద్దు గ్రామాలు, మహారాష్ట్ర సంబంధాలున్న ఓటర్ల దగ్గర తెలుగుతోపాటు మరాఠీలోనూ మాట్లాడిస్తూ ఓటువేయాలని కోరుతున్నారు.

జనాల్లోనే ఉండేలా జాన్సన్..

ఖానాపూర్ నియోజకవర్గ ప్రజలకు కొత్తముఖంగా తెరపైకి వచ్చిన జాన్సన్‌నాయక్ ఎప్పుడూ జనాల్లో ఉండేలా ప్లాన్ చేస్తున్నారు. ఓవైపు తాను ప్రచారం, కార్యక్రమాల్లో పాల్గొంటూనే మరోవైపు మిగతా మండలాలకు తన ప్రధాన అనుచరులను పంపిస్తున్నారు. ఒకేరోజులో అన్నివైపులా పార్టీ ప్రచారం సాగేలా ప్రణాళిక ప్రకారం ముందుకెళ్తున్నారు. మంత్రి కేటీఆర్‌కు దగ్గరి మిత్రుడన్న ప్రచారాన్నీ ఆయన అనుచరులు ప్రజల్లోకి తీసుకెళ్తున్నారు. బీఆర్‌ఎస్ మళ్లీ గెలిచి ప్రభుత్వం ఏర్పడితే జాన్సన్‌నాయక్‌కు మంచి స్థానం ఉంటుందని, ఖానాపూర్ దశ మారుతుందని చెబుతున్నారు.

బీఆర్‌ఎస్‌తోనే మరింత అభివృద్ధి

- మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి

మామడ: తెలంగాణ అభివృద్ధి బీఆర్‌ఎస్‌తోనే సాధ్యమని రాష్ట్ర మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం మండలంలోని వాస్తాపూర్ గ్రామంలో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ముందుగా మంత్రికి పార్టీ కార్యకర్తలు, గ్రామస్తులు ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా మంత్రి బీఆర్‌ఎస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, చేసిన అభివృద్ధి వివరిస్తూ ఓట్లు అభ్యర్థించారు. గెలిపిస్తే చేయనున్న పనులపై హామీ ఇచ్చారు. కాగా, ఎన్నికల ప్రచారంలో భాగంగా మంత్రి ఐకే రెడ్డి వాస్తాపూర్ వెళ్తుండగా గొర్రెలు మేపుతున్న మహేశ్‌తో ముచ్చటించారు. కాగా, తనకు ప్రభుత్వం అందించిన సబ్సిడీ గొర్రెలతో ఉపాధి లభించిందని మహేశ్ తెలుపగా మంత్రి సంతృప్తి చెందారు. నాయకులు రాంకిషన్‌రెడ్డి, హరీశ్‌కుమార్, గంగారెడ్డి, లింగారెడ్డి, భాస్కర్‌రావు, సంతోష్, గంగారాం పటేల్, రాందాస్, చంద్రశేఖర్‌గౌడ్, భాస్కర్, సీతారాం తదితరులున్నారు.

హనుమాన్ ఆలయంలో పూజలు

రాష్ట్ర మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి ఎన్నికల ప్రచారాన్ని సెంటిమెంట్ ప్రకారం మండలంలోని మారుమూల గిరిజన గ్రామమైన వాస్తాపూర్ నుంచి ప్రారంభించారు. ముందుగా ఇక్కడి హన్మాన్ ఆలయంలో పూజలు నిర్వహించారు.

స్పెషల్.. ముధోల్


- నిర్మల్ జిల్లాలోనే ప్రత్యేక స్థానం
- అంతకుముందు నాందేడ్ జిల్లాలో..
- ఇప్పటిదాకా ఎమ్మెల్యేలుగా ఐదుగురు
- ఎక్కువకాలం కాంగ్రెస్‌కే అనుకూలం
- పార్టీలకంటే వ్యక్తులకే ప్రాధాన్యం
- మరాఠీ మాట్లాడే వారే ఎక్కువ..



హన్మంత్‌రెడ్డి



నారాయణరావుపటేల్



వేణుగోపాలాచారి



విఠల్‌రెడ్డి



బాసర సరస్వతీ అమ్మవారు



ముధోల్ ముఖచిత్రం

భైంసా: నిర్మల్ జిల్లాలో ముధోల్ నియోజకవర్గానిది ప్రత్యేక స్థానం. భాషాప్రయుక్త రాష్ట్రాలు ఏర్పడక ముందు 1952కు మునుపు ఈప్రాంతమంతా మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లాలోనే ఉండేది. 1952 తర్వాత ఈ ప్రాంతాన్ని తెలంగాణలో కలిపారు. ఈ ప్రాంతంలో ఎక్కడ చూసినా మహారాష్ట్ర సంప్రదాయమే కనిపిస్తుంది. పార్టీలకంటే తాలుకాలో వ్యక్తులకే ప్రాధాన్యం ఇస్తారు.

చదువులమ్మ కొలువుదీరింది ఇక్కడే..

చదువులమ్మ కొలువైన బాసర సరస్వతీ ఆలయం ఈ తాలుకాలోనే ఉంది. కొత్త జిల్లాలు ఏర్పడ్డాక అమ్మవారు కొలువున్న బాసరను మండలంగా ఏర్పాటు చేశారు. ఈ ఆలయానికి నిత్యం వేల సంఖ్యలో భక్తులు వస్తుంటారు. దేశవ్యాప్తంగా అక్షర శ్రీకార పూజలు ఇక్కడే జరుగుతాయి. తెలంగాణ రాష్ట్రంలో గోదావరి నది సరస్వతీ పాదాలను ముద్దాడుతూ ఈ ప్రాంతం నుంచే ప్రవహిస్తుంటుంది. ఈ నదిపైనే శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నిర్మించారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో ఉమ్మడి రాష్ట్రంలో ట్రిపుల్‌ఐటీని ఏర్పాటు చేశారు. ఇక్కడ చదివే విద్యార్థులు అధికసంఖ్యలో కొలువులు సాధిస్తున్నారు.

ఇదీ రాజకీయ చరిత్ర..

దివంగత నేత గడ్డెన్న ఆరుసార్లు ముధోల్ తాలుకాకు ఎమ్మెల్యేగా పని చేశారు. 1967లో స్వతంత్ర అభ్యర్థిగా, 1972లో రెడ్డి కాంగ్రెస్ నుంచి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మిగతా నాలుగుసార్లు కాంగ్రెస్ ఎమ్మెల్యేగా గెలిచారు. ఈ ప్రాంతంలో కాంగ్రెస్ కంటే గడ్డెన్న పార్టీగానే ఎక్కువగా ముద్ర వేయగలిగారు. అంతగా చదువు రాకపోయినా గడ్డెన్న తనదైన ముద్రవేస్తూ ప్రత్యేక ఓటు బ్యాంక్ పెంచుకున్నారు. 1985లో గడ్డెన్న టీడీపీ నుంచి పోటీచేసిన హన్మంత్‌రెడ్డి చేతిలో ఓడిపోయారు. 1989లో కాంగ్రెస్ ఎమ్మెల్యేగా గెలిచిన గడ్డెన్న బీసీ సంక్షేమశాఖ మంత్రిగా, హైదరాబాద్ సిటీ ఇన్‌చార్జిగా పని చేశారు. 1994లో టీడీపీ నుంచి వ్యాపార వేత్త నారాయణరావుపటేల్ రాజకీయ అరంగేట్రం చేసి గడ్డెన్నను ఓడించారు. 1999 ఎన్నికల్లో మళ్లీ నారాయణరావుపటేల్‌పై గడ్డెన్న గెలిచారు. 2004లో జరిగిన ఎన్నికల్లో నారాయణరావుపటేల్‌కు టీడీపీ టికెట్ దక్కకపోవడంతో టీఆర్‌ఎస్‌లో చేరారు. ఆ సమయంలో జమిలీ ఎన్నికల్లో ఈ స్థానాన్ని టీఆర్‌ఎస్‌కు కేటాయించారు. దీంతో గడ్డెన్న నారాయణరావుపటేల్ గెలుపు కోసం పని చేసి పోలింగ్‌రోజు 20.04.2004న తుదిశ్వాస విడిచారు. 2004లో నారాయణరావు పటేల్ టీఆర్‌ఎస్, కాంగ్రెస్ ఉమ్మడి అభ్యర్థిగా భారీ మెజార్టీతో గెలుపొందారు. 2009 ఎన్నికల్లో కాంగ్రెస్ నుంచి నారాయణరావు పటేల్, టీడీపీ నుంచి వేణుగోపాలాచారి, ప్రజారాజ్యం నుంచి విఠల్‌రెడ్డి పోటీచేశారు. ఆ ఎన్నికల్లో వేణుగోపాలాచారి ఎమ్మెల్యేగా గెలుపొందారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక 2014 ఎన్నికల్లో టీఆర్‌ఎస్ నుంచి వేణుగోపాలాచారి, కాంగ్రెస్ నుంచి విఠల్‌రెడ్డి, బీజేపీ నుంచి రమాదేవి పోటీ చేశారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడ్డాక కాంగ్రెస్ నుంచి విఠల్‌రెడ్డి ముథోల్ ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. అనంతరం ఆయన టీఆర్‌ఎస్‌లో చేరారు. 2018 ఎన్నికల్లో టీఆర్‌ఎస్ అభ్యర్థిగా విఠల్ రెడ్డి, బీజేపీ అభ్యర్థిగా పడకంటి రమాదేవి కాంగ్రెస్ అభ్యర్థిగా పవార్ రామారావుపటేల్, ఎన్సీపీ (నేషనల్ కాంగ్రెస్ పార్టీ) అభ్యర్థిగా బోస్లే నారాయణరావుపటేల్ బరిలో నిలిచారు. ఈ ఎన్నికల్లో విఠల్ రెడ్డి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు.

వరుసగా నాలుగుసార్లు..



గడ్డెన్న

ముధోల్ ఎమ్మెల్యేగా ఆరు పర్యాయాలు పని చేసిన గడ్డెన్న హ్యాట్రిక్ సాధించారు. 1967లో స్వతంత్ర అభ్యర్థిగా, 1972లో రెడ్డి కాంగ్రెస్ నుంచి 1978, 1983లో కాంగ్రెస్ నుంచి వరుసగా నాలుగుసార్లు ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. 1972లో గడ్డెన్న ఏకగ్రీవ ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. ముధోల్ నియోజకవర్గంలో గోపిడి గంగారెడ్డి, గడ్డెన్న స్వతంత్ర అభ్యర్థులుగా ఒక్కోసారి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. నిత్యం ప్రజాసేవలో ఉంటున్న స్వతంత్ర అభ్యర్థులను ఎమ్మెల్యేలుగా ఎన్నుకున్న ఘనత ముధోల్ నియోజకవర్గానికి ఉంది. ఇదే నియోజకవర్గంలో గడ్డెన్నను ఒకసారి ఏకగ్రీవ ఎమ్మెల్యేగా ప్రజలు ఎన్నుకున్నారు.

జిల్లా: నిర్మల్

నియోజకవర్గం: ముధోల్

మండలాలు: 7 (భైంసా, ముధోల్, కుంటాల, కుభీర్, తానూరు, లోకేశ్వరం, బాసర)

మున్సిపాలిటీ: 1 (భైంసా)

ఎవరెవరు.. ఎప్పుడెప్పుడు గెలిచారంటే..

1957లో గోపిడి గంగారెడ్డి (సోషలిస్ట్ పార్టీ)
1962లో గోపిడి గంగారెడ్డి (కాంగ్రెస్)
1967లో గడ్డెన్న (స్వతంత్ర)
1972లో గడ్డెన్న (రెడ్డి కాంగ్రెస్)
1978లో గడ్డెన్న (కాంగ్రెస్)
1983లో గడ్డెన్న (కాంగ్రెస్)
1985లో ఏ హన్మంత్‌రెడ్డి (టీడీపీ)
1989లో గడ్డెన్న (కాంగ్రెస్)
1994లో బీ నారాయణరావుపటేల్ (టీడీపీ)
1999లో గడ్డెన్న (కాంగ్రెస్)
2004లో బీ నారాయణరావుపటేల్ (టీఆర్‌ఎస్)
2009లో ఎస్.వేణుగోపాలాచారి (టీడీపీ)
2014లో గడ్డిగారి విఠల్‌రెడ్డి (కాంగ్రెస్)
2018లో గడ్డిగారి విఠల్‌రెడ్డి (టీఆర్‌ఎస్)

ప్రస్తుత ఎన్నికల్లో..

2023 ఎన్నికల్లో మరోసారి బీఆర్‌ఎస్ విఠల్‌రెడ్డినే అభ్యర్థిగా ప్రకటించి 'బీ' ఫారం అందించింది. ఇప్పటికే బీఆర్‌ఎస్ ప్రచారం ప్రారంభించింది. కాంగ్రెస్, బీజేపీ ఇంకా అభ్యర్థులను ప్రకటించలేదు. కాంగ్రెస్ నుంచి మాజీ ఎమ్మెల్యే బోస్లే నారాయణరావుపటేల్ బరిలో ఉంటారని ఇప్పటికే ప్రచారం జరుగుతోంది. ఇక వైద్యుడు కిరణ్‌కొమ్రేవార్ టికెట్ తనకే ఇచ్చారని చెబుతున్నారు. ఇక బీజేపీలో జిల్లా అధ్యక్షురాలు పడకంటి రమాదేవి, రాష్ట్ర నాయకులు రామారావుపటేల్, మోహన్‌రావుపటేల్ ఎవరికి వారుగా టికెట్ కోసం ప్రయత్నం చేస్తున్నారు. ఈ ఎన్నికల్లో మరోసారి మూడు పార్టీల మధ్య పోటీ జరగనుంది.


ముధోల్ స్ట్రాంగ్‌రూంను పరిశీలించిన కలెక్టర్



స్ట్రాంగ్‌రూంను పరిశీలిస్తున్న కలెక్టర్

భైంసా: ముధోల్‌లోని స్ట్రాంగ్‌రూంను గురువారం కలెక్టర్ ఆశీష్‌సంగ్వాన్ పరిశీలించారు. ఎన్నికల దృష్ట్యా అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఏఎస్పీ కాంతిలాల్ పాటిల్, ఇతర అధికారులున్నారు.

ఆస్పత్రి తనిఖీ



సిబ్బందితో మాట్లాడుతున్న ధన్‌రాజ్

కడెం: ఈనెల 18న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిని పరిశీలించి డాక్టర్ లేకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. కాగా, గురువారం డీఎంహెచ్‌వో ధన్‌రాజ్ ఆస్పత్రిని సందర్శించారు. సమయపాలన పాటించాలని సిబ్బందికి సూచించారు. కాగా, కడెం పీహెచ్‌సీ డాక్టర్ శివకుమార్‌ను ఖానాపూర్ ప్రభుత్వ ఆస్పత్రికి డిప్యూటేషన్‌పై పంపినా.. డీఎంహెచ్‌వో, కలెక్టర్ వచ్చి హడావుడి చేసి వెళ్లారని స్థానికులు ఆరోపించారు.

దస్తురాబాద్: మండల కేంద్రంలోని పీహెచ్‌సీని డీఎంహెచ్‌వో ధనరాజ్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నందున అప్రమత్తంగా ఉండాలని వైద్యసిబ్బందికి సూచించారు. వైద్య శిబిరాలు నిర్వహించి వ్యాధిగ్రస్తులకు చికిత్స అందించాలని ఆదేశించారు. ఆయన వెంట వైద్యుడు కామేశ్వర్, ఆరోగ్య విస్తరణాధికారి వేణుగోపాల్, హెల్త్‌సూపర్‌వైజర్ లలిత, సిబ్బంది ప్రసన్న, రాజేందర్, రవి, మల్లేశ్, శివ శ్రీనివాస్ తదితరులున్నారు.

ఉద్యమకారులకు అన్యాయం

- డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావు



పార్టీలోకి ఆహ్వానిస్తున్న శ్రీహరిరావు

నిర్మల్‌చైన్‌గేట్: తెలంగాణ ఉద్యమకారులకు సీఎం కేసీఆర్ అన్యాయం చేశారని నిర్మల్ నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి, డీసీసీ అధ్యక్షుడు కూచాడి శ్రీహరిరావు ఆరోపించారు. సారంగపూర్ మండలం చించోలి (బీ) గ్రామానికి చెందిన ఉద్యమకారుడు, ఎంపీటీసీ సభ్యుడు వెంకట్‌రామ్‌రెడ్డి బీఆర్‌ఎస్‌కు గురువారం రాజీనామా చేసి జెడ్పీటీసీ సభ్యుడు పత్తిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో శ్రీహరిరావు క్యాంపు కార్యాలయంలో కాంగ్రెస్‌లో చేరారు. ఇదే మండలంలోని కంకెట గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ వార్డు సభ్యులు గంగామణి కాంగ్రెస్‌లో చేరగా, వీరికి శ్రీహరిరావు కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా శ్రీహరిరావు మాట్లాడుతూ.. రాష్ట్రంలో అన్ని వర్గాలకు బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేసిందేమీలేదని విమర్శించారు. వచ్చే ఎన్నికల్లో ఆ పార్టీకి ప్రజలు బుద్ధి చెప్పడం ఖాయమని పేర్కొన్నారు. కాంగ్రెస్‌ను ఆశీర్వదించాలని కోరారు.

డ్రోన్ వినియోగంపై అవగాహన



రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

ఖానాపూర్: మండలంలోని దిలావర్‌పూర్ గ్రామంలోని రైతులకు గురువారం డ్రోన్‌తో క్రిమిసంహారకాల పిచికారీపై అధికారులు అవగాహన కల్పించారు. భారతీయ వరి పరిశోధన స్థానం హైదరాబాద్‌లోని రాజేంద్రనగర్ అధికారులతోపాటు సేవాస్ఫూర్తి ఫౌండేషన్, వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కీటక విభాగం శాస్త్రవేత్త డాక్టర్ శ్రీధర్ మాట్లాడారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో సాగుచేయడం ద్వారా సరైన సమయంలో సరైన సస్యరక్షణచర్యలు చేపట్టవచ్చని తెలిపారు. తద్వారా సమయం ఆదా కావడంతో పాటు ఖర్చులు తగ్గి ఎక్కువ విస్తీర్ణంలోని పంటలను కాపాడి అధిక దిగుబడి పొందవచ్చని పేర్కొన్నారు. మామూలు స్ప్రేయర్లతో ఎకరానికి గంట నుంచి రెండు గంటల సమయం పడుతుందని, డ్రోన్‌తో ఐదు నుంచి ఆరు నిమిషాలు మాత్రమే పడుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఆసం రవి, రత్నాకర్, సాయికృప, రాకేశ్, రహీం, భద్రయ్య, సంతోష్, లింగన్న తదితరులున్నారు.

పార్టీ విజయానికి కృషి చేయాలి

- బీజేపీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి
- పార్టీలో పలువురి చేరిక



పార్టీలో చేరినవారితో మహేశ్వర్‌రెడ్డి

నిర్మల్‌చైన్‌గేట్: రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ విజయానికి కృషి చేయాలని బీజేపీ నేత, మాజీ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి కోరారు. గురువారం నిర్మల్ రూరల్ మండలం లంగ్డాపూర్, ఎల్లారెడ్డిపేట్, ముజ్గి, మామడ మండలం పొన్కల్, దిలావర్‌పూర్ మండలం బన్సపల్లి, కంజర్ గ్రామాలకు చెందిన వివిధ పార్టీలు, సంఘాల నాయకులు బీజేపీలో చేరగా మహేశ్వర్‌రెడ్డి ఆయన క్యాంపు కార్యాలయంలో పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వ పథకాల గురించి ఇంటింటా వివరిస్తూ పార్టీ గెలుపునకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. నాయకులు అనిల్, తక్కల రమణారెడ్డి, ముత్యం రెడ్డి, జమాల్, నర్సారెడ్డి, అలివేలు మంగ, కొండ్ర రాజారెడ్డి, బాపురెడ్డి, నరేశ్, ముత్యం, గంగాధర్, రాజేశ్వర్, గంగారెడ్డి, ఇప్ప నర్సారెడ్డి, పీసర శైలేశ్వర్, విక్రమ్, సామ రాజేశ్వర్‌రెడ్డి, సందీప్‌గౌడ్, ప్రశాంత్, ప్రవీణ్‌గౌడ్, శ్రీకాంత్, అరే శ్రీనివాస్, శ్రీనివాస్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

గిరిజన విద్యార్థులకు సన్మానం



సన్మానిస్తున్న దిలీప్‌కుమార్

ఉట్నూర్‌రూరల్: ఇటీవల వరంగల్‌లో జరిగిన అథ్లెటిక్స్ అండర్–14లో ప్రతిభ కనబర్చిన జిల్లాకు చెందిన పరుశురాం, సతీశ్ గిరిజన విద్యార్థులను ఐటీడీఏ డీడీ దిలీప్‌కుమార్ సన్మానించారు. ఐటీడీఏ కార్యాలయ ఆవరణలో గురువారం వారిని సత్కరించి బహుమతులు అందజేశారు. జాతీయస్థాయిలో పతకాలు సాధించాలని ఆకాంక్షించారు. జిల్లా గిరిజన క్రీడాధికారి పార్థసారథి, ఏపీవో పీవీటీజీ భాస్కర్, ఏవో రాంబాబు, ఏసిఎంఒ జగన్, ఏటీడీవో క్రాంతి ఉన్నారు.

చిట్‌ఫండ్ మేనేజర్‌పై కేసు

ఆదిలాబాద్‌టౌన్: పట్టణంలోని కనకదుర్గా చిట్‌ఫండ్ కంపెనీ మేనేజర్ హన్సారీపై కేసు నమోదు చేసినట్లు టూటౌన్ సీఐ అశోక్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. దస్నాపూర్‌కు చెందిన శీలానంద్ చిట్‌ఫండ్‌లో చిట్టీ కడుతున్నాడు. ఇటీవల ఆయనకు చిట్టీ డబ్బులు ఇవ్వాల్సి ఉండగా కొన్నినెలలుగా ఇవ్వకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నాడు. బాధితుడు గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

గుడుంబా స్థావరాలపై దాడులు



బెల్లంపానకాన్ని పారబోస్తున్న అధికారులు

పెంబి: మండలంలోని పెంబితండా, ఇటిక్యాల్ తండా గ్రామాల్లో ఆదిలాబాద్ ఎక్సైజ్ సీఐ గంగారెడ్డి, నిర్మల్ ఎక్సైజ్ ఎస్సై రవికుమార్, పెంబి ఎస్సై రజినీకాంత్ గురువారం దాడులు నిర్వహించారు. పులియబెట్టిన 1800 లీటర్ల బెల్లం పానకాన్ని పారబోశారు. పెంబితండాకు చెందిన అంగోత్ రాజేందర్, రాథోడ్ జ్యోతి, ఇటిక్యాల్ తండాకు చెందిన సపావత్ జూలీబాయిను అదుపులో తీసుకున్నారు. తహసీల్దార్ కార్యాలయంలో వారిని బైండోవర్ చేశారు.

సమ్మె జయప్రదం చేయండి



మాట్లాడుతున్న సీతారామయ్య

కాసిపేట: సింగరేణి వ్యాప్తంగా ఈనెల 21న నిర్వహించే సమ్మెను జయప్రదం చేయాలని ఏఐటీయూసీ అధ్యక్షుడు సీతారామయ్య కోరారు. గురువారం మందమర్రి ఏరియా కాసిపేట గనిపై నిర్వహించిన గేట్ మీటింగ్‌కు ఆయన హాజరై మాట్లాడారు. సింగరేణికి వచ్చిన లాభాలను కార్మికుల ఖాతాల్లో జమ చేయాలన్నారు. లేకపోతే సమ్మె యథాతథంగా నిర్వహిస్తామన్నారు. బ్రాంచి ఇన్‌చార్జి చిప్ప నర్సయ్య, బ్రాంచి కార్యదర్శి దాగం మల్లేశ్, బ్రాంచి ఉపాధ్యక్షుడు బియ్యాల వెంకటస్వామి, పిట్ కార్యదర్శి మినుగు లక్ష్మీనారాయణ, నాయకులు దాసరి తిరుపతిగౌడ్, నాగేశ్వరరావు, గొల్ల శ్రీనివాస్, రాజేందర్, రత్నం అయిలయ్య, లింగయ్య ఉన్నారు.

డిపాజిట్ గల్లంతు..!

- ఓట్లు రాలక దక్కని ధరావత్



ఎన్నికల్లో పోటీ చేయాలంటే డిపాజిట్ చెల్లించాల్సిందే. ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేయడానికి ఎస్సీ, ఎస్టీ సామాజిక వర్గాలకు చెందిన వారు రూ.5వేలు, ఇతర సామాజిక వర్గాలకు చెందిన వారు రూ.10వేలు డిపాజిట్ చెల్లించాల్సి ఉంటుంది. ఎన్నికల సంఘం నిర్దేశించిన మేరకు ఆయా నియోజకవర్గాల్లో పోలైన ఓట్లలో 1/6శాతం ఓట్లు సాధిస్తే డిపాజిట్ దక్కుతుంది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని పది అసెంబ్లీ నియోజకవర్గాల్లో 2014 శాసనసభ ఎన్నికల్లో వివిధ పార్టీల నుంచి మొత్తంగా 107 మంది పోటీ చేయగా 80మంది డిపాజిట్ కోల్పోయారు. 2018లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో 123 మంది పోటీ చేయగా వారిలో వంద మంది డిపాజిట్ గల్లంతైంది.

– సాక్షి, మంచిర్యాలడెస్క్

గత ఎన్నికల్లో నోటాకు పోలైన ఓట్లు

నియోజకవర్గం	2014 ఎన్నికలు	2018 ఎన్నికలు
సిర్పూర్	1752	1579
చెన్నూర్	1609	2135
బెల్లంపల్లి	769	2598
మంచిర్యాల	1472	1394
ఆసిఫాబాద్	2829	2715
ఖానాపూర్	2421	2776
ఆదిలాబాద్	850	1149
బోథ్	2242	2275
నిర్మల్	1360	1367
ముధోల్	1791	2266

గత ఎన్నికల్లో పోటీ చేసిన, డిపాజిట్లు కోల్పోయిన వారు

నియోజకవర్గం	2014లో పోటీచేసిన వారు	డిపాజిట్ దక్కనివారు	2018లో పోటీ చేసిన వారు	డిపాజిట్ దక్కనివారు
సిర్పూర్	11	8	12	10
చెన్నూర్	15	13	14	12
బెల్లంపల్లి	21	19	13	11
మంచిర్యాల	13	11	21	19
ఆసిఫాబాద్	8	5	10	8
ఖానాపూర్	6	3	12	10
ఆదిలాబాద్	15	12	14	11
బోథ్	5	2	7	4
నిర్మల్	7	4	8	6
ముధోల్	6	3	12	9

చెల్లని ఓట్లు



ఎన్నికల్లో ఈవీఎంల వినియోగం కారణంగా చెల్లని ఓట్లకు చెక్ పడింది. కానీ పోస్టల్ బ్యాలెట్లలో ఓట్లు చెల్లకుండా పోవడం కొనసాగుతూనే ఉంది. ఎన్నికల విధుల్లో పాల్గొనే ఉద్యోగులు, సర్వీసు ఓటర్లు పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు వేసే అవకాశాన్ని ఎన్నికల సంఘం కల్పించింది. అభ్యర్థి గుర్తుకు ఎదురుగా వేయకపోవడమో.. ఇద్దరు గుర్తులపై వేయడమో చేస్తే చెల్లని ఓటుగా పరిగణిస్తారు. 2014 శాసనసభ ఎన్నికల్లో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని పది నియోజకవర్గాల్లో 12,420 పోస్టల్ బ్యాలెట్ ఓట్లు పోలయ్యాయి. వీటిలో 2,429 ఓట్లు చెల్లకుండా పోయాయి. 2018లో జరిగిన ఎన్నికల్లో 8,502 పోస్టల్‌బ్యాలెట్ ఓట్లు పోలయ్యాయి. వీటిలో 698 పోస్టల్ బ్యాలెట్ ఓట్లు చెల్లని ఓట్లుగా గుర్తించారు. వీటిలో సిర్పూర్ నియోజకవర్గంలో 32, చెన్నూర్‌లో 15, బెల్లంపల్లిలో 25, మంచిర్యాలలో 151, ఆసిఫాబాద్‌లో 72, ఖానాపూర్‌లో 53, ఆదిలాబాద్‌లో 94, బోథ్‌లో 44, నిర్మల్‌లో 164, ముధోల్‌లో 48 పోస్టల్ బ్యాలెట్ ఓట్లు చెల్లకుండా పోయాయి. విద్యావంతులైన వారి ఓట్లే చెల్లకుండా పోవడం గమనార్హం.

ప్రచార అనుమతులకు 'సువిధ'



సువిధ పోర్టల్

నిర్మల్‌ఖిల్లా: ఓటు నమోదు నుంచి అభ్యర్థుల నామినేషన్ వరకు ప్రతీ ఎన్నికల ప్రక్రియను సులభతరం చేసేలా ప్రత్యేక యాప్‌లు, పోర్టల్‌ను ఎన్నికల సంఘం అందుబాటులోకి తెచ్చింది. ఆండ్రాయిడ్ ఫోన్లలో డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. అభ్యర్థులు, రాజకీయ పార్టీలు ఎన్నికల ప్రచారంలో వివిధ అనుమతుల కోసం దరఖాస్తు సమర్పించవచ్చు. ఇవి గతంలో ఉన్నప్పటికీ తగిన ప్రచారం లేక, ఎవరూ వినియోగించకపోవడం వల్ల అంతగా ప్రాచుర్యంలోకి రాలేదు. ఎన్నికల సంఘం ఈసారి అన్ని యాప్‌లపై విస్తృత ప్రచారం కల్పిస్తోంది. జిల్లాలో రాజకీయ పార్టీల ప్రదర్శనలు, ర్యాలీలు, ఎన్నికల ప్రచార అనుమతుల కోసం సువిధ పోర్టల్ గురించి తెలుసుకుందాం.

దరఖాస్తులు పరిశీలించాకే..

సభలు, సమావేశాల నిర్వహణ, ర్యాలీలు, ప్రదర్శనలు, ప్రచార వాహన అనుమతి, తాత్కాలిక ఎన్నికల కార్యాలయాల ఏర్పాటు, లౌడ్‌స్పీకర్ల వినియోగం తదితర గురించి దరఖాస్తులు చేసుకోవచ్చు. ఇవి పరిశీలన అనంతరం జిల్లా అధికారులు అనుమతులు జారీ చేస్తారు.

'నోటా'కేశారు..!

ప్రజాస్వామ్యంలో ఓటు వజ్రాయుధం వంటిది. సరైన నాయకులను ప్రజాప్రతినిధులుగా చట్టసభలకు ఎన్నుకోవడంలో సామాన్యులకు కీలకమైనది. కానీ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు అందరికీ ఆమోదయోగ్యులైన వారై ఉండాలని ఏమీ లేదు. గతంలో నచ్చని అభ్యర్థులు బరిలో ఉన్నా ఎవరికో ఒకరికి ఓటు వేయాల్సి వచ్చేది. మరికొందరు ఓటింగ్‌కు దూరంగా ఉండేవారు. వీటిని దృష్టిలో ఉంచుకుని ఈవీఎం బ్యాలెట్లలో నోటా(నన్ ఆఫ్ ద ఎబోవ్) బటన్ తీసుకొచ్చారు. ఇది కేవలం ఓటరుకు ఐచ్ఛికం మాత్రమే. అభ్యర్థులు ఎవరూ సరైన వారు లేరని భావిస్తే నోటాకు ఓటు వేయొచ్చు. అభ్యర్థుల గెలుపోటములను ప్రభావితం చేయదు. అత్యధికులు నోటాను వినియోగించుకున్నా పోలైన ఓట్లలో మెజార్టీ ఓట్లు పొందిన అభ్యర్థిని విజేతగా ప్రకటిస్తారు. 2014 శాసనసభ ఎన్నికల్లో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని 10 నియోజకవర్గాల్లో 17,095 మంది ఓటర్లు నోటా బటన్ నొక్కారు. గత 2018 అసెంబ్లీ ఎన్నికల్లో పది అసెంబ్లీ నియోజకవర్గాల్లో 20,254 ఓట్లు నోటాకు పోలయ్యాయి. అభ్యర్థులు, పార్టీలపై అసంతృప్తే కారణమనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

ఎలా వచ్చిందంటే..

2013లో పీపుల్స్ యూనియన్ ఫర్ సివిల్ లిబర్టీస్ కేసులో సుప్రీంకోర్టు వెలువరించిన తీర్పు ఆధారంగా నోటాను ప్రవేశపెట్టారు. దీన్ని భావ వ్యక్తీకరణలో అంతర్భాగంగానే పరిగణించాలని సుప్రీంకోర్టు పేర్కొంది. తొలిసారిగా ఢిల్లీ, మిజోరాం, రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్ రాష్ట్రాల్లో 2013 డిసెంబర్‌లో జరిగిన ఎన్నికల్లో నోటా ఐచ్ఛికాన్ని ప్రవేశపెట్టారు. అన్ని గుర్తుల కంటే చివరలో నోటా గుర్తు ఉంటుంది. ఈ గుర్తును అహ్మదాబాద్‌కు చెందిన నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డిజైన్ సంస్థ రూపొందించింది.



పత్రాలు లేకనే నగదు సీజ్

- చెక్‌పోస్టుల వద్ద తనిఖీల్లో పట్టుబడిన సొత్తు
- ఆధారపత్రాలు చూపకపోవడంతో సీజ్
- సొమ్మంతా మహారాష్ట్ర వ్యాపారులదే



వివరాలు వెల్లడిస్తున్న ఉట్నూర్ డీఎస్పీ నాగేందర్, ఇచ్చోడ సీఐ చంద్రశేఖర్ (ఫైల్)

ఇచ్చోడ: ఎన్నికల నియామవళి, నిబంధనలు అమల్లోకి వచ్చాయి. కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాలతో అధికారులు, పోలీసులు జిల్లాలో డబ్బు, మద్యం తరలింపుపై ప్రత్యేక నిఘా పెట్టారు. నిబంధనలకు విరుద్ధంగా రూ.50 వేలు కన్నా అధిక డబ్బు తీసుకెళ్తే ఆధారాలు చూపాల్సిందే. లేకపోతే సీజ్ చేయాలని ఆదేశాలు ఉన్నాయి. ఆదిలాబాద్ జిల్లాకు నాలుగు వైపులా మహారాష్ట్ర సరిహద్దు ఉంది. వీటి పరిధిలో మొత్తం 10 చెక్‌పోస్టులు ఏర్పాటు చేశారు. మహారాష్ట్ర నుంచి తెలంగాణలోకి ప్రవేశించే సమయంలో చెక్‌పోస్టుల వద్ద తనిఖీల్లో నగదు పట్టుబడుతున్నాయి. ఈ సొత్తు అంతా మహారాష్ట్ర వ్యాపారులదే కావడం గమనార్హం. వీరికి తెలంగాణలో ఎన్నికల నిబంధనలు తెలియక తమ వ్యాపారం నిమిత్తం నగదుతో ఆదిలాబాద్‌కు వస్తుండగా పట్టుబడుతున్నారు.

10 చెక్‌పోస్టులు..

జిల్లాలో శంకర్‌గూడ, పిప్పర్‌వాడ, అనందపూర్, లక్ష్మీపూర్, కరంజి, ఘన్‌పూర్, మేడిగూడ ఏడు అంతరాష్ట్ర చెక్‌పోస్టులు ఏర్పాటు చేయగా. కొత్తగూడ, జైనూర్, రోల్‌మామడల వద్ద మరో మూడు జిల్లా సరిహద్దుల చెక్‌పోస్టులు ఏర్పాటు చేశారు. వీటి వద్ద వాహన తనిఖీలు చేస్తున్నారు. ఎన్నికల నిబంధనలు అమల్లోకి వచ్చిన నుంచి ఇప్పటివరకు రూ. 81.64 లక్షలు పట్టుకుని సీజ్ చేశారు. పట్టుకున్న వాటిలో వ్యాపారుల డబ్బులే ఎక్కువగా ఉన్నాయి.

కొన్ని ఘటనలు..

- ఈనెల 18న మహారాష్ట్రలోని పర్లి వైజ్యనాథ్‌కు చెందిన వ్యాపారి బద్రినాథ్ ఆదిలాబాద్ జిల్లా మీదుగా చంద్రపూర్‌కు కారులో వెళ్తున్నారు. నేరడిగొండ మండలం రోల్‌మామడ టోల్‌ప్లాజ్ వద్ద పోలీసుల తనిఖీలో రూ.40 లక్షలు పట్టుబడ్డాయి.
- ఈనెల 17న మహారాష్ట్రలోని కోర్పణకు చెందిన శుభం శంకర్ గైక్వాడ్ వ్యాపారి కారులో 9 లక్షల నగదును తీసుకుని ఆదిలాబాద్‌కు వస్తున్నాడు. బేల వద్ద ఉన్న అంతర్రాష్ట్ర చెక్‌పోస్టు వద్ద పట్టుకున్నారు.
- ఈనెల 17న మహారాష్ట్ర నుంచి ఆదిలాబాద్ వైపు కారులో వస్తున్న మునీంద్ర కారును తనిఖీ చేశారు. కారులో రూ 5.10 లక్షలను పట్టుకున్నారు.
- ఈనెల 17న ఆదిలాబాద్ నుంచి బజార్‌హత్నూర్ మీదుగా మహారాష్ట్రలోని మహగావ్‌కు వెళ్తున్న కారును బజార్‌హత్నూర్ సమీపంలో పోలీసులు తనిఖీ చేశారు. రూ.3.58 లక్షల నగదును పట్టుకున్నారు. ఎలాంటి పత్రాలు లేకపోవడంతో సీజ్ చేశారు.

నగదు పట్టివేత



లక్ష్మీంపూర్ చెక్‌పోస్టు వద్ద పట్టుకున్న నగదుతో పోలీసులు

సారంగపూర్: ఎన్నికల కోడ్ అమల్లో ఉండడంతో సారంగాపూర్–నిర్మల్ ప్రధాన రహదారిపై గురువారం వాహనాల తనిఖీ నిర్వహించారు. ఓవ్యక్తి వద్ద బ్యాగులో ఉన్న రూ.7 లక్షలు పట్టుబడినట్లు ఎస్సై కృష్ణసాగర్‌రెడ్డి తెలిపారు. ఎలాంటి ఆధారాలను చూపకపోవడంతో డీటీవోకు నగదు అప్పగించామన్నారు. సదరు వ్యక్తిపై కేసు నమోదు చేశామన్నారు.

తలమడుగు: మండలంలోని లక్ష్మీపూర్ అంతర్రాష్ట్ర చెక్‌పోస్టు వద్ద రూ.2.90లక్షల నగదును పట్టుకున్నట్లు పోలీసులు తెలిపారు. కిన్వాట్ నుంచి ఆదిలాబాద్‌కు కారులో ముస్కాన్ పటాన్ వెళ్తుండగా రూ.90 వేల నగదును స్వాధీనం చేసుకున్నారు. మహారాష్ట్రలోని సార్కని నుంచి కారులో ఆదిలాబాద్‌కు వస్తుండగా రూ.2 లక్షలను పట్టుకున్నారు. స్టాటిస్టికల్ సర్వేలెన్స్ టీం అధికారి ఆడే మధుసూదన్, డీఎస్‌వో ఆఫీస్ అదిలాబాద్, ఎస్సై ధనశ్రీ, ఏఎస్సై బి.సురేందర్ ఉన్నారు.

భైంసారూరల్: భైంసా–నిర్మల్ ప్రధాన రహదారి మాటేగాం టోల్‌ప్లాజా సమీపంలో రూ.65వేల నగదు పట్టుకున్నట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. షాహిద్ వద్ద ఉన్న నగదును గుర్తించి స్వాధీనం చేసుకున్నామన్నారు.

మద్యం పట్టివేత

చింతల్‌బోరిలో శంకర్ మద్యం విక్రయిస్తుండగా అదుపులో తీసుకున్నట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా మద్యం విక్రయిస్తున్నట్లు సమాచారంతో గురువారం దాడి చేశామన్నారు. రూ. 25 వేల విలువ గల మద్యాన్ని స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

కుభీర్: మండలంలోని మహారాష్ట్ర సరిహద్దు వద్ద ఏర్పాటుచేసిన చెక్‌పోస్ట్ వద్ద పట్టుబడిన రూ.3.50లక్షల నగదును సీజ్‌చేసినట్లు పోలీసులు తెలిపారు. భోకర్ నుంచి కుభీర్‌కు ఒకరు వాహనంలో వస్తుండగా నగదు పట్టుకున్నామని ఎస్సై ఎండీ.షరీఫ్ తెలిపారు.

ఆదిలాబాద్‌రూరల్: మండలంలోని జందాపూర్ ఎక్స్‌రోడ్డు వద్ద రూ.75వేల నగదును పట్టుకున్నట్లు ఎస్సై ముజాహిద్ తెలిపారు. మహారాష్ట్రలోని పాటన్‌కు చెందిన అశోక్ వాహనంలో వస్తుండగా ఈ నగదును పట్టుకుని ఎన్నికల ఫ్లయింగ్ స్క్వాడ్‌కు అప్పగించామన్నారు.

'పోలింగ్' పెంపే లక్ష్యంగా

- జోరుగా ఓటరు నమోదు
- జిల్లాలో అవగాహన, చైతన్య కార్యక్రమాలు
- స్వీప్ ఆధ్వర్యంలో నిర్వహణ

జిల్లాలో..

నియోజకవర్గం	పోలింగ్ కేంద్రాలు
నిర్మల్	306
ఖానాపూర్	305
ముధోల్	311



సైకిల్ ర్యాలీని ప్రారంభిస్తున్న కలెక్టర్ (ఫైల్)

నిర్మల్‌చైన్‌గేట్: ప్రజాస్వామ్యంలో ఓటే వజ్రాయుధం. ఐదేళ్లకోసారి వచ్చే ఎన్నికల్లో హక్కును వినియోగించుకునేలా అధికార యంత్రాంగం దృష్టి సారించింది. ఇందులో భాగంగా స్వీప్'ఆధ్వర్యంలో జిల్లాలో చైతన్య కార్యక్రమాలు, అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నారు. వందశాతం పోలింగ్ పెంపే లక్ష్యంగా జోరుగా ఓటరు నమోదు చేస్తున్నారు. అర్హులందరినీ ఓటరుగా నమోదు చేసుకునేలా చైతన్య పరుస్తున్నారు. స్వీప్(సిస్టమేటిక్ ఓటర్స్ ఎడ్యుకేషన్ అండ్ ఎలక్టోరల్ పార్టిసిపేషన్)లో వివిధ కార్యక్రమాలు చేపడుతున్నారు.

ప్రణాళికలు సిద్ధం..

ఎన్నికలకు మరో 42 రోజులు మాత్రమే మిగిలి ఉంది. ఈ నేపథ్యంలో పోలింగ్ శాతం పెంపు లక్ష్యంగా ప్రణాళికలు సిద్ధం చేశారు. జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ అధికారి..స్వీప్ జిల్లా నోడల్ అధికారిగా వ్యవహరించనున్నారు. వారి నేతృత్వంలో నియోజకవర్గానికి ఒకరు చొప్పున అధికారిని నియమించే యోచనలో ఉన్నారు. ఇప్పటికే ర్యాలీలు, ప్రదర్శనలు మొదలయ్యాయి. ఇటీవల సైక్లింగ్ యాత్ర చేపట్టగా ఎన్నికల అధికారులు, యువత భాగస్వాములయ్యారు.

ప్రత్యేక దృష్టి..

2018 డిసెంబర్ 7న జరిగిన శాసనసభ ఎన్నికల్లో జిల్లాలో జిల్లా ఓటర్ల సంఖ్య 6,21,454 మంది కాగా, ఈనెల 4న విడుదలైన తుది జాబితా ప్రకారం ఆ సంఖ్య 7.11 లక్షలు పైమాటే. ఈసారి వందశాతం లక్ష్యంగా..ప్రధానంగా పట్టణాలు, మండల కేంద్రాలు, తక్కువ పోలింగ్ నమోదైన ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించాలని నిర్ణయించారు. గత ఎన్నికల్లో తక్కువ పోలింగ్ నమోదైన ప్రాంతాలపై ఆరా తీస్తున్నారు. ఆయా చోట్ల మానవహారాలు, అవగాహన సదస్సులు నిర్వహించాలని నిర్ణయించారు.

మహిళా సంఘాల సభ్యులతో..

మహిళా సంఘాల ఆధ్వర్యంలో దసరా నవరాత్రి ఉత్సవాలు పురస్కరించుకుని ఈనెల 18 నుంచి 20వ తేదీల్లో మూడు రోజులపాటు మహిళా సంఘాల సభ్యులకు అవగాహన కల్పించనున్నారు. విద్యాసంస్థల్లోనూ అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నారు. వివిధ ప్రచార మాధ్యమాలు, సినిమా థియేటర్లు, స్థానిక కేబుల్ వ్యవస్థల ద్వారా చైతన్యం తేస్తున్నారు. జిల్లా ఎన్నికల అధికారి, ఆర్వోల నేతత్వంలో ఈ ప్రక్రియ కొనసాగుతోంది. జిల్లాలో గ్రామీణాభివృద్ధి సంస్థ పరిధిలో 11,986 స్వయం సహాయక సంఘాల్లో 1.34 లక్షల మంది సభ్యులుగా ఉన్నారు. జిల్లాలో ఉపాధి హామీ కింద 3.30 లక్షల మంది కూలీలు నమోదై ఉన్నారు. తొలుత వారికి అవగాహన కల్పిస్తారు.

కార్యాచరణ రూపొందించాం



జిల్లా ఎన్నికల అధికారి ఆశిష్ సంగ్వాన్ ఆదేశాల మేరకు కార్యాచరణ ఆమోదం పొందగానే అమలు చేస్తాం. ఈనెల 18 నుంచి 20 వరకు మహిళా సంఘాల ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. కొత్త ఓటర్లతో పాటు గతంలో తక్కువ పోలింగ్ నమోదైన ప్రాంతాలను దృష్టిసారిస్తాం. పారదర్శకంగా ఎన్నికలు నిర్వహించే తీరు, ఓటు వేయడం వల్ల ప్రయోజనాలు, ఇతర అంశాలు ప్రజల్లోకి తీసుకెళ్తాం.

– విజయలక్ష్మి, స్వీప్ జిల్లా నోడల్ అధికారి

విద్యుత్ షాక్‌తో వలస కూలీ మృతి

- మరొకరికి గాయాలు

తానూరు: విద్యుత్ షాక్‌తో వలస కూలీ మృతిచెందగా, మరొకరికి గాయాలయ్యాయి. మండల కేంద్రంలో ఈ ఘటన చోటు చేసుకుంది. స్థానికులు, తోటి కూలీలు తెలిపిన వివరాలు.. తానూరులో జరుగుతున్న ఇంటి నిర్మాణ పనుల కోసం పశ్చిమబెంగాల్‌కు చెందిన వలసకూలీలు వచ్చారు. గురువారం మధ్యాహ్నం స్లాబ్ వేసేందుకు మిల్లర్ పైప్‌లు బిగిస్తున్నారు. భైంసా నుంచి తానూరు సబ్‌స్టేషన్‌కు సరఫరా చేసే 33 కేవీ విద్యుత్ తీగలు అక్కడ ఉన్నాయి. షేక్ సలీం, రాకేశ్‌లు మిల్లర్ పైప్‌లను బిగిస్తుండగా 33 కేవీ విద్యుత్ షాక్‌కు గురయ్యారు. షేక్ సలీం రెండు చేతులు పూర్తిగా కాలిపోయాయి. తోటి కూలీలు వారిని భైంసాలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. షేక్ సలీం (25)ను పరీక్షించిన వైద్యులు మృతిచెందినట్లు తెలిపారు. గాయాలైన రాకేశ్ చికిత్స పొందుతున్నాడు. ఎస్సై సందీప్‌ను వివరణ కోరగా, ఇప్పటి వరకు తమకు ఫిర్యాదు రాలేదన్నారు.

మద్యానికి బానిసై యువకుడి ఆత్మహత్య

బజార్‌హత్నూర్: మద్యానికి బానిసై యువకుడు పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై నరేశ్ కథనం ప్రకారం.. మండలంలోని జాతర్ల గ్రామానికి చెందిన మడవి గోరక్‌నాథ్, పూర్ణబాయి దంపతుల రెండో కుమారుడు నగేష్(21) బుధవారం రాత్రి మద్యం తాగి ఇంటికి వచ్చాడు. కుటుంబ సభ్యులు మందలించారు. మనస్తాపం చెంది చేనులోకి వెళ్లి గుర్తుతెలియని పురుగుల మందు తాగాడు. విషయం తెలుసుకున్న కుటుంబీకులు ఘటన స్థలానికి చేరుకుని వెంటనే బజార్‌హత్నూర్ పీహెచ్‌సీకి తరలించారు. మెరుగైన వైద్యం కోసం ఆదిలాబాద్ రిమ్స్‌కు తరలించగా చికిత్స పొందుతూ గురువారం మృతిచెందాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఉరివేసుకుని వృద్ధుడి ఆత్మహత్య



భీమేశ్వర్ (ఫైల్)

సోన్: అనారోగ్యంతో బాధపడుతున్న వృద్ధుడు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై సంతోషం రవీందర్ కథనం ప్రకారం.. మండల కేంద్రానికి వృద్ధుడు ఓలిగేటి భీమేశ్వర్ (60) పదేళ్ల నుంచి అనారోగ్యంతో బాధపడుతున్నాడు. మతిస్థిమితం లేక గురువారం ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. భార్య ప్రవళిక ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

యువతి అదృశ్యం



హర్ష బేగం(ఫైల్)

నర్సాపూర్(జి): మండల కేంద్రానికి చెందిన యువతి హర్ష బేగం (20) గత మూడు రోజులుగా కనిపించడం లేదు. బంధువుల ఇళ్లలో ఆచూకీ కోసం వెతికినా దొరకకపోవడంతో సోదరుడు మహమ్మద్ సుమేర్ గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసినట్లు ఎస్సై రవీందర్ పేర్కొన్నారు.

పత్తి కొనుగోళ్లు చేపట్టాలి



ఏర్పాట్లను పరిశీలిస్తున్న రైతు సంఘ నాయకులు

ఆదిలాబాద్‌టౌన్: ఎన్నికల కోడ్‌తో రైతులకు ఎలాంటి సంబంధం లేదని, వారి పంట ఉత్పత్తులు కొనుగోళ్లు చేయాలని అఖిలపక్ష రైతు సంఘం నాయకుడు బండి దత్తాత్రి డిమాండ్ చేశారు. గురువారం ఆదిలాబాద్ వ్యవసాయ మార్కెట్‌యార్డులో పంట కొనుగోళ్ల ఏర్పాట్లను సంఘం నాయకులు పరిశీలించారు. రైతులకు కల్పిస్తున్న సౌకర్యాలపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వానాకాలం పంటలు రైతుల చేతికి వచ్చి ఇంట్లో నిల్వ ఉన్నాయని, మార్కెట్‌లో అమ్ముదామంటే కొనుగోళ్ల ప్రారంభం కాలేదన్నారు. దీనిపై కలెక్టర్‌ను కలిస్తే ఎన్నికల కోడ్ ఉందని చెబుతున్నారన్నారు. పండించిన పంటలు అమ్ముకోవడానికి కోడ్‌కు ఏం సంబంధమని ప్రశ్నించారు. వరంగల్, ఖమ్మం, రాయచూర్ మాదిరిగా ఆదిలాబాద్ మార్కెట్ నిరంతరంగా కొనసాగించాలన్నారు. ఈసారి సీసీఐతోపాటు రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థ మార్క్‌ఫెడ్ కూడా రంగంలోకి వస్తే మద్దతు ధర లభిస్తుందన్నారు. 12 శాతంతో మద్దతు ధరకు పత్తిని తీసుకోవాలని డిమాండ్ చేశారు. గోవర్ధన్, రమేశ్, గణపతిరెడ్డి, దేవిదాస్, కేమ లక్ష్మణ్ ఉన్నారు.

పోలీస్ విధులకు అడ్డుపడ్డ ముగ్గురి రిమాండ్

ఆదిలాబాద్‌టౌన్: పోలీసుల విధులకు అటంకం కలిగించిన మహారాష్ట్రకు చెందిన ముగ్గురిని రిమాండ్‌కు తరలించినట్లు టూటౌన్ సీఐ అశోక్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. ఈనెల 4న అత్యాయత్నం కేసుకు సంబంధించి నిందితులను కోర్టుకు హాజరుపర్చిన సమయంలో ఇద్రీస్, గణేశ్, సోహెబ్, రషీద్‌లు పోలీసుల విధులకు అడ్డుపడ్డారు. దీంతో నలుగురిపై కేసు నమోదు చేయగా, రషీద్ పరారీలో ఉన్నారని సీఐ వివరించారు.